
మాట్లాడుతున్న బైరెడ్డి శబరి


చంద్రబాబును కలిసిన రాంపుల్లారెడ్డి





మీకేం కావాలి..
సంక్షేమమా? సంక్షోభమా?

- రాష్ట్రాన్ని జగన్ గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారు
- నంద్యాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం
- మైనారిటీలను ఆదుకుంటాం
- వైసీపీ ప్రభుత్వంలో అన్ని రకాలుగా బాదుడే బాదుడు
- టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు

నంద్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో అన్ని రకాలుగా మీరు ఇబ్బందులపాలయ్యారు.. మీకు టీడీపీ ఇచ్చే సంక్షేమ పాలన కావాలా? వైసీపీ వచ్చే సంక్షోభాలు కావాలా?.. అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజాగళం సభలో పాల్గొనేందుకు శనివారం నంద్యాలకు విచ్చేసిన చంద్రబాబు స్థానిక రాజ్ థియేటర్ సర్కిల్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ తాను నంద్యాలలో అరెస్టయిన తర్వాత మొదటిసారి నంద్యాల పట్టణానికి వచ్చానని అన్నారు. కుట్రపూరితంగా అరెస్టు చేసి జైల్లో తనను చంపుతామని బెదిరించారని అన్నారు. తిరుపతి వద్ద 24 క్లైమోర్ మైన్లతో బ్లాస్ట్ చేస్తే, ఆ వేంకటేశ్వరస్వామి కాపాడారని, అంతపెద్ద ప్రమాదానికి భయపడని తాను, సైకో జగన్‌కు భయపడతానా? అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ అన్ని రకాలు బాదుడు అమలు చేశారని, చెత్త పన్ను, కరెంటు బిల్లులు అంటూ ప్రజలను నానా ఇబ్బందులు పెట్టారని అన్నారు. టీడీపీ హయంలోనే నంద్యాల అభివృద్ధి చెందిందని, మళ్లీ నంద్యాల అభివృద్ధి చెందాలంటే టీడీపీ గెలవాలని చంద్రబాబు అన్నారు. జగన్ రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, వైసీపీ నాయకులు చేస్తున్న అకృత్యాలకు అమాయకులు బలవుతున్నారని, అందుకు సాక్ష్యం అబ్దుల్ సలాం కుటుంబ ఆత్మహత్యేనని చంద్రబాబు విరుచుకుపడ్డారు.

వైసీపీ ప్రభుత్వంలో బాదుడే బాదుడు..

ఒక్క ఛాన్స్ అని గద్దెనెక్కిన జగన్ ప్రజలను పూర్తిగా ఇబ్బందులపాలు చేశారని, కరెంటు బిల్లులు పెంచి, చెత్త పన్ను వేసి నడ్డి విరిచారని, పేదలకు రూ.10 ఇచ్చి రూ.100 కొట్టేశారని, ధరలు విపరీతంగా పెంచేసి మధ్య తరగతి ప్రజల మీద తీవ్ర భారం మోపారని అన్నారు. ఇక మందు బాబుల జేబులు గుల్ల చేసేలా రూ.40 ఉండే క్వార్టర్ బాటిల్‌ను రూ.200 చేశారని, జే బ్రాండ్లు తీసుకువచ్చి ప్రాణాలను తీస్తున్నారని దుయ్యబట్టారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక పేద, మధ్య తరగతి ప్రజల మీద భారం పడకుండా చూస్తానని, ఉచిత ఇసుక తీసుకువస్తానని, జే బ్రాండ్లు రద్దు చేసి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడతానని హామీ ఇచ్చారు. ఇక సూపర్ సిక్స్ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని, ముఖ్యంగా మహిళలకు, నిరుద్యోగులకు, రైతులకు మేలు జరుగుతుందన్నారు. సీఎంగా తొలి సంతకం మెగా డీఎస్సీ మీద పెడతానన్నారు.

అడ్రస్ లేని వాడు ప్రజల బాగోగులు పట్టించుకుంటాడా..?

సైకో జగన్ తనకు ఫోన్ లేదని, అడ్రస్ లేదని అబద్ధాలు చెబుతున్నారని, అలాంటి వ్యక్తి ప్రజల బాగోగుల పట్టించుకుంటారా? అని చంద్రబాబు ప్రశ్నించారు. జగన్ రాయలసీమ ద్రోహి అని ఇక్కడి సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నాశనం చేశారని, ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను నందికొట్కూరు నుంచే మొదలుపెట్టానని, అంగళ్లలో తన మీద దాడి చేసి తిరిగి తన మీదే కేసు పెట్టారని గుర్తు చేశారు. మీకు జగన్ విధ్వంస పాలన కావాలా? అభివృద్ధి పాలన కావాలా? మీ బిడ్డలకు ఉద్యోగాలు కావాలా? గంజాయి, డ్రగ్స్ కావాలా? మిమ్మల్ని నడిపించే నాయకుడు కావాలా? నరరూప రాక్షసుడు కావాలా? అనేది తేల్చుకోవాలని కోరారు. మీకు మేలు జరగాలని కోరుకుంటే మాత్రం సైకో పాలనను అంతం చేసి జగన్‌ను తరిమి కొట్టాలన్నారు. గత ఎన్నికల్లో రాయలసీమలో 52 సీట్లకు గాను వైసీపీకి 49 సీట్లు ఇచ్చారని, రానున్న ఎన్నికల్లో అది తిరగబడి టీడీపీ 49 సీట్లు రావాలని చంద్రబాబు కోరారు.

గొప్ప నాయకుడు పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ తనకు మిత్రుడని, ఆయన గొప్ప నాయకుడని, సినీ రంగంలోనే కాకుండా, రాజకీయాల్లో కూడా నిజమైన హీరో అని చంద్రబాబు అన్నారు. ప్రజల కోసం పనిచేసే వ్యక్తి అని ప్రశంసించారు. రాష్ట్రంలో పెద్ద సైకో ఉన్నట్లే, స్థానికంగా నంద్యాలలో పిల్ల సైకో ఉన్నారని, ఇక్కడికి అల్లు అర్జున్ వస్తే జనసేన జెండాలు పట్టించి చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని, ఈ నండే ఎమ్మెల్యేను శాశ్వతంగా ఇంటికి పంపించాలని చంద్రబాబు అన్నారు. ఇక జనసేన అభ్యర్థులు లేని చోట గాజు గుర్తు కేటాయించడంతో, దానిని తమకు అనుకూలంగా మార్చుకునేలా ఇక్కడ నాయకులు ఎత్తుగడలు వేస్తున్నారని దానిని తిప్పి కొట్టాలన్నారు.



మైనారిటీల అభివృద్ధి కోసం..

తాను మైనారిటీలకు అన్యాయం చేస్తానని వైసీపీ అబద్ధపు ప్రచారం చేస్తోందని, వాస్తవానికి మైనారిటీల కోసం మొదటి నుంచి టీడీపీ కృషి చేస్తోందని చంద్రబాబు అన్నారు. కర్నూలు, హైదరాబాద్‌లలో ఉర్దూ యూనివర్శిటీలను తీసుకువచ్చానని, ఉమ్మడి రాష్ట్రంలో ఉర్దూ భాషను రెండో అధికార భాషగా చేశానని, దుల్హన్ పథకం, ఇమామ్, మౌజమ్‌లకు రూ.5 వేలు ఇచ్చానని అన్నారు. ఎన్నార్సీ, సీఏఏలకు మద్దతుగా వైసీపీ పార్లమెంటులో దొంగ ఓట్లు వేసి, ఇపుడు మైనారిటీల మీద దొంగ ప్రేమ చూపుతోందని దుయ్యబట్టారు. తాను అబ్దుల్ కలాంను రాష్ట్రపతిని చేసేందుకు దోహదపడితే, వైసీపీ అబ్దుల్ సలాం కుటుంబాన్ని, మిస్బా వంటి మైనారిటీలను పొట్టన పెట్టుకుందన్నారు. కేవలం మైనారిటీలనే కాకుండా మిగతా వర్గాల వారిని కూడా అభివృద్ధి దిశగా తీసుకువెళతామని, టీడీపీ అధికారంలోనికి రాగానే విదేశీ విద్య, చంద్రన్న బీమా, ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం రూ.25 లక్షలతో హెల్త్ ఇన్సూరెన్స్ కూడా తీసుకువస్తామని హామీ ఇచ్చారు. మాదిగల కోసం ఏబీసీడీ వర్గీకరణ తీసుకువచ్చి న్యాయం చేస్తామన్నారు. ఇక్కడ అభివృద్ధి సాగాలంటే ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే అభ్యర్థి ఫరూఖ్‌ను గెలిపించాలని చంద్రబాబు కోరారు.



ల్యాండ్ టైటిలింగ్ పాటకు చిందులేసిన సభికులు..

భూ యజమానుల భూమిని దోచేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తీసుకొచ్చారని, ఈ విషయాన్ని ప్రజల్లోనికి వెళ్లడానికి టీడీపీ ఓ పాటను రికార్డు చేయించింది. ఈ పాటను నంద్యాల సభలో టీడీపీ అధినేత వినిపించారు. ఈ భూమి మనిదిరా.. ఈ జగన్ ఎవడురా! అంటూ సాగే ఈ పాట పెట్టగానే సభికుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. వారి ఊపును చూసి చంద్రబాబు కూడా చేతులు ఊపుతూ జోష్‌గా కనిపించారు.

బ్యాలెట్ బాక్సులు బద్దలు కావాలి

చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేసిన వైసీపీ నేతలకు బుద్ధి చెప్పేలా నంద్యాలలో టీడీపీ పవర్ తెలిసేలా బ్యాలెట్ బాక్సులు ఓట్లతో నిండిపోవాలి. ఇక్కడ పేటీయం బ్యాచ్‌కు, మరికొంత మందికి కేవలం 20 రోజులు సమయం మాత్రమే ఉంది. నంద్యాలలో పార్లమెంటు స్థానం భారీ మెజారిటీతో గెలిచి చంద్రబాబుకు గిఫ్ట్ ఇవ్వబోతున్నాం.

- బైరెడ్డి శబరి, నంద్యాల పార్లమెంటు స్థానం టీడీపీ అభ్యర్థి

చంద్రబాబు వల్లే నంద్యాల అభివృద్ధి

చంద్రబాబు నాయుడి కృషి వల్లే నంద్యాల ఈ స్థాయిలో అభివృద్ధి చెందింది. టీడీపీ హయాంలో నంద్యాలలో రోడ్లు వెడల్పు చేశాం. ఆటో నగర్ తీసుకువచ్చాం. మైనారిటీల కోసం దేశంలో ఏ నాయకుడూ చేయని విధంగా చంద్రబాబు మేలు చేశారు. ఉర్దూ వర్శిటీలు, హజ్ హౌస్‌లు, షాదిఖానాలు తీసుకువచ్చాం. వైసీపీ మైనారిటీలకు ఏమీ మేలు చేయలేదు. ఎస్సీల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించలేదు.

- ఫరూక్,నంద్యాల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులకు జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి


ఎన్నికల నిబంధనలు పాటించాలని నోడల్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి కె.శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), మే 11: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా జరగడానికి పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి కె.శ్రీనివాసులు కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు చివరి 48 గంటల ప్రొటోకాల్‌పై ఎస్పీ రఘువీర్‌రెడ్డితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ మెటీరియల్ పోలింగ్ కేంద్రాలకు చేరవేయడం... పోలింగ్ తర్వాత తిరిగి ఆర్జీఎం, శాంతిరామ్ ఇంజనీరింగ్ కాలేజీలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో వాటిని భద్రపరచడం మొదలైన అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశామన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల వెలుపలే ఏజంట్లు కౌంటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్‌కు ముందు 48 గంటల నుంచి ఎన్నికల ముగిసే వరకు కీలకమైన సమయమని, పోలింగ్ ఏర్పాట్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఓటర్లను ప్రభావితం చేసే నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ఎఫ్ఎస్‌టీ, వీఎస్టీ బృందాలు నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు పోటీ చేసే అభ్యర్థులకు ఒక వాహనం, ఎలెక్షన్ ఏజంట్లకు ఒక వాహనం, అసెంబ్లీ సెగ్మెంట్లకు ఒక వాహనం చొప్పున అనుమతిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రఘువీర్ రెడ్డి, రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

జగన్‌ను నమ్మితే అధోగతే !


సభా వేదికపై నుంచి అభివాదం చేస్తున్న జేపీ నడ్డా, నాయకులు

- ఏపీలో ప్రతి వ్యక్తి మీద రూ.2.50 లక్షల అప్పు
- ఉత్తుత్తి బటన్ నొక్కే సీఎం
- జగన్ ప్రభుత్వం మాఫియా మయం
- అవినీతి అంతం కావాలంటే ఎన్డీఏ కూటమికే పట్టం కట్టండి
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

ఆదోని, మే 11: ప్రజలు జగన్మోహన్ రెడ్డిని మరో మారు నమ్మితే రాష్ట్రం అధోగతి పాలవుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు. శనివారం ప్రజాగళంలో భాగంగా జేపీ నడ్డా ఆదోనిలో పర్యటించారు. ఆదోని అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజును గెలిపించాలంటూ మున్సిపల్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన దేశంలో వివక్ష లేకుండా "సబ్‌కా సాథ్... సబ్‌కా వికాస్" నినాదంతో ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి విశేష కృషి చేస్తున్నాడన్నారు. దేశంలోని ప్రతి రైతుకు ఏటా పెట్టుబడి సాయం కింది రూ.6వేలు అందిస్తున్నామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కొనసాగిస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో పండించిన పంట ఉత్పత్తులకు మంచి ధర అందిస్తామని హామీ ఇచ్చారు. దేశంలో పేదలందరికీ నివాసగృహాలు అందించాలన్న ఉద్దేశంతో కేంద్రం ఏపీకి 21 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే, వాటిని కూడా సీఎం జగన్ పూర్తి చేయలేదని అన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా డీబీటీ ద్వారా అందిస్తున్నామని చెబుతున్నా, సీఎం ఉత్తుత్తి బటన్‌లు నొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో అక్కా చెల్లెమ్మలకు ఉజ్వల పథకం ద్వారా 11 కోట్ల గ్యాస్ కనెక్షన్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని, తగ్గించి ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తెస్తామన్నారు. మహిళా స్వయం సహాయక గ్రూపులను బలోపేతం చేసి వారిని లక్షాధికారులను చేస్తామని అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెరిగిపోతున్నాయని, సౌర ఉత్పత్తిని పెంచి నిరుపేదలైన వారికి ఉచితంగా విద్యుత్ ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఆరోగ్యవంతమైన దేశంగా తీర్చిదిద్దేందుకు అయిష్మాన్ భారత్ కింద 5 కోట్ల మందికి అయుష్మాన్ కార్డులను అందించామన్నారు. ఏటా కార్పొరేట్ ఆసుపత్రులలో రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యాన్ని పొందే సౌకర్యాన్ని నరేంద్రమోదీ కల్పించారని అన్నారు. జగన్ ఏపీ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి రూ.2.50 లక్షల అప్పు తలపై మోపారని అన్నారు. రాష్ట్రంలో కాకినాడ, అమరావతి, వైజాగ్‌లను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేశామని, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి కారిడార్లను నిర్మించి 4వేల కిలోమీటర్ల జాతీయ రహదారులను విస్తరింపజేశామని అన్నారు. రైల్వే స్టేషన్‌లను విద్యుదీకరించామని, ప్రతి గ్రామానికి ఇంటర్నెట్‌ను అభివృద్ధి పరిచామన్నారు. కర్నూలును అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకుంటానని జగన్‌ను నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. జగన్ ప్రభుత్వం లిక్కర్ మాఫియా, భూమాఫియా, ఇసుక మాఫియాలలో మునిగిపోయిందని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సైకిల్, కమలం, గ్లాసు గుర్తులకు ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఎన్డీఏ కూటమి అవినీతిని అంతం చేసేందుకు ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఆదోని అసెంబ్లీ ఎన్డీఏ అభ్యర్థి డా. పీవీ పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, జనసేన నాయకుడు మల్లప్ప, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, దేవేంద్రప్ప, విట్టా రమేష్, చంద్రమౌళి, నాగరాజ్ గౌడ్, ప్రకాష్ జైన్, శ్రీనివాసాచారి, శ్రీకాంత్ రెడ్డి, గుడిసె కృష్ణమ్మ, భాస్కర్ రెడ్డి, తెలుగు యువత కార్యదర్శి వెంకటేష్ చౌదరి, సాయి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించండి

కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

నంద్యాల క్రైం, మే 11 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసు సిబ్బంది పనిచేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన కర్నూలు రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పలు సూచనలు, సలహాలపై డీఐజీ దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అందరూ బాధ్యతాయుతంగా, నిబద్ధతతో టీమ్ వర్క్ చేయాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా కల్పించాలని పేర్కొన్నారు. పోలీసు సిబ్బందికి విధి నిర్వహణలో అవసరమైన సలహాలు, సూచనలు శనివారమే ఉన్నతాధికారులు ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో చేయాల్సిన, చేయకూడని విధులపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. సమస్యాత్మక, ఫ్యాక్షన్ గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతులు నిర్వహిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియ అంతా సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, వీడియో కెమెరాలతో చిత్రీకరించాలని ఆదేశించారు. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు ఎస్పీ జి .కృష్ణకాంత్, నంద్యాల ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి, వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ సిద్ధార్థకౌశల్, అన్నమయ్య జిల్లా ఎస్పీ బి. కృష్ణరావు, డీఎస్పీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి ఉచిత రవాణా సదుపాయం



కర్నూలు(కలెక్టరేట్), మే 11: పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించనున్న సిబ్బందికి 120 ఆర్టీసీ బస్సుల ద్వారా ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన శనివారం తెలిపారు. ఆదివారం ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఉదయం 4.30 గంటలకు, 5.30, 6.30 గంటలకు కర్నూలు నుంచి పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాలకు అదే విధంగా 12వ తేదీన ఉదయం 4.30, 5.30, 6.30 గంటలకు పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాల నుంచి కర్నూలుకు వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని బస్ స్టేషన్లలో ప్రత్యేక బస్సు కౌంటర్లను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు.

నిశ్శబ్దం పాటించండి

నంద్యాల, కర్నూలు జిల్లాల కలెక్టర్లు



కర్నూలు(కలెక్టరేట్), మే 11: పోలింగ్ ముగింపునకు 48 గంటల ముందు నిశ్శబ్ద సమయం పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన శనివారం అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం 6 గంటల నుంచి సైలెన్స్ పీరియడ్‌ను పాటించాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఇతర రాజకీయ పార్టీల నాయకులు బహిరంగ సభలు, రోడ్‌షోలలో పాల్గొనకూడదని అన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారాలు నిలిపివేయాలని చెప్పారు. ఇతర జిల్లాల రాజకీయ పార్టీల నాయకులు కర్నూలు జిల్లాలో ఉండకూడదన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 14వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎక్కడా ఐదుగురికి మించి ఒకే చోట గుమికూడదని స్పష్టం చేశారు.



నంద్యాల (కల్చరల్): పోలింగ్ ముగింపుకు 48 గంటల ముందు నిశబ్ద సమయం పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి డా.కె.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలింగ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ విధించామని, ఈ సెక్షన్ మే 11వ తేదీ సాయంత్రం 6గంటల నుంచి 13 వతేదీ సాయంత్రం 6 గంటల వరకు అమలులో ఉంటుందని తెలిపారు. ఐదుగురు వ్యక్తులకు మించి ఒకే చోట గుమికూడరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే 13వ తేదీ పోలింగ్ సమయం ముగిసే వరకు మద్యం దుకాణాలు, వైన్‌షాపులు, బార్లు రెస్టారెంట్లతో సహా దుకాణాలు మూసివేయాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు బహిరంగ సభలు, రోడ్‌షోలలో పాల్గొనకూడదని, సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిలిపివేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే ఆర్పీ యాక్ట్ 1951 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విల్లు ఎక్కుపెట్టిన బుడ్డా



విల్లంబు వదులుతున్న బుడ్డా

ఆత్మకూరు, మే 11: టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి విల్లు ఎక్కుపెట్టి, కత్తి చేతబట్టి పెచ్చెర్వు గిరిజనులను ఆకట్టుకున్నారు. నల్లమల అంతర్భాగంలోని పెచ్చెర్వు చెంచుగూడెంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అక్కడి చెంచులతో మమేకమై వారి కష్టాలను తెలుసుకున్నారు. చెంచులు తమ నివాసాలను ఆయనకు చూపించి జీవన పరిస్థితులను వివరించారు. అలాగే విల్లంబులు, వారి ఆయుధాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విల్లంబులు వదిలి వారితో ఆనందాన్ని పంచుకున్నారు. ఆయనతోపాటు కుమార్తె డాక్టర్ మేఘనరెడ్డి, అల్లుడు సాయి జయంత్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఉన్నారు.



చెంచుల ఆయుధాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ఓటరన్నా ఓ సారి గమనించు..!


కర్నూలు(కల్చరల్), మే 11:
నిన్నటి వరకు నీ చెవిలో
హోరెత్తించిన
నాయకుల నినాదాలన్నీ,
వాగ్దానాలన్నీ
ఒక్కసారిగా మూగబోయాయి.
వీధులు, వాడలు, ఊరి సందు
గొందుల్లో
నేతల పెద్దపెద్ద కటౌట్లతో తిరిగిన
ప్రచార రథాలన్నీ మూలకు
చేరాయి.
మిన్నంటిన డీజే శబ్దాలు, తప్పెట
మోతలు
ఆట పాటలతో సాగిన లౌడ్
స్పీకర్లు
ఒక్కసారిగా చప్పుడు చేయకుండా
పోయాయి.
చందమామను తీసుకు వస్తామని
కొందరు
చుక్కల పల్లకీలో ఊరేగిస్తామని
మరికొందరు
నీ పాద దాసునిగా ఉంటామని
ఇంకొందరు
నిన్ను మహారాజులా
మార్చేస్తామని మరికొందరు
అందలాలు ఎక్కించే యత్నం
చేశారు
నీ ముందు ఆశల పతంగులను
ఆకాశంలో ఎగురవేశారు.
అనేక రూపాల్లో నిన్ను
ప్రలోభాలకు గురిచేశారు.

ఓటరన్నా జాగ్రత్త...
నీవు స్వయంగా వారి గత చరిత్ర
గమనించు
ఆపై వారి తీరుతెన్నులను
పరిశీలించు
బహుముఖ రూపాల్లోని భూ
బకాసురులను
తెల్ల దుస్తులు వేసుకున్న
మేకవన్నెల పులులను
భూములను కాజేస్తూ తాకట్టు
పెట్టేసే కబ్జాకోరులను
గెలిచిన అనంతరం ముఖం
చాటేసే దగా కోరులను
తెలుసుకొని ఓటు ఆయుధాన్ని
ప్రయోగించు
ఈ ఎన్నికల వేళ... తుది తీర్పు
కోసం
రేపు నిన్ను 'ఏక్ దిన్‌కా
సుల్తాన్'లా భావిస్తున్నారు
రేపటి నీ 'ఓటు'తో తమ తలరాత
మార్చుకోనున్నారు.
నీ ఓటు వారి భవితకు వారధి
కానీ నీవు ఎంచుకోవాలి మన
భవిష్యత్తుకు మంచి సారథి

- ఎం. శ్రీనివాసరాజు,
కర్నూలు

13న స్థానిక సెలవు

కర్నూలు(కలెక్టరేట్), మే 11: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 13న జిల్లా వ్యాప్తంగా స్థానిక సెలవు మంజూరు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన శనివారం తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, స్థానిక సంస్థలు, కార్యాలయాలు, పరిశ్రమలకు లోకల్ హాలిడే ప్రకటించామని తెలిపారు. అన్ని పబ్లిక్, ప్రైవేటు విద్యా సంస్థలు, బ్యాంకులకు కూడా సెలవును ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.



కాటసాని రామిరెడ్డిపై పూర్తిగా వ్యతిరేకత

బనగానపల్లెలో టీడీపీ వైపే జనాలు

బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపు

నల్లేరు మీద నడకే!

బనగానపల్లె పోరు రసవత్తరంగా మారింది. గతంలో బనగానపల్లె నియోజవర్గం పాణ్యం నియోజవర్గంలోని ఒక మండలంగా ఉండేది. అయితే 1999లో నియోజకవర్గాల డీలిమిటేషన్ వల్ల బనగానపల్లె ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడింది. బనగానపల్లె నియోజవర్గంలో ప్రస్తుతం బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలు ఉన్నాయి. పునర్విభజన జరగక ముందు బనగానపల్లె మండలం పాణ్యం నియోజవర్గంలో ఉండేది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో బనగానపల్లె నియోజకవర్గంలో హోరాహోరీ పోరు జరుగుతోంది. బనగానపల్లె అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా బీసీ జనార్దన్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థిగా కాటసాని రామిరెడ్డి బరిలో ఉన్నారు.

బనగానపల్లె, మే 11:



కార్యకర్తలే బీసీకి బలం

టీడీపీ కార్యకర్తలే బీసీజనార్దన్‌రెడ్డికి బలమని చెప్పవచ్చు. ఈ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే చల్లా రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు చల్లా భగీరథ రెడ్డిలు మృతి చెందడంతో చల్లా కుటుంబీకుల హవా తగ్గినట్లయింది. స్వయంగా వ్యాపారవేత్త, కాంట్రాక్టర్ అయినా బీసీ జనార్దన్‌రెడ్డి 2011లో రాజకీయాల్లోకి వచ్చారు. బనగానపల్లె నియోజకవర్గం నుంచి ఆయన 2014 టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి 17 వేల 341 ఓట్లతో గెలిచి కాటసాని రామిరెడ్డిని ఓడించారు. అయితే రెండోసారి 2019లో వైసీపీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డి చేతిలో 13, 547 ఓట్లతో ఓడిపోయారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోదరుడు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, చల్లా రామకృష్ణారెడ్డి సోదరుడు చల్లా విజయభాస్కర్‌రడ్డిలతో పాటు వందలాది వైసీపీ నాయకులు టీడీపీలో చేరడం అదనపు బలంగా చెప్పవచ్చు.

బీసీ రాజారెడ్డి అదనపు బలం

బీసీ జనార్దన్‌రెడ్డికి ఆయన సోదరుడు బీసీ రాజారెడ్డి కొండంత బలమని చెప్పవచ్చు. బనగానపల్లె పట్టణంలో సుమారు 40వేల వరకు ఓటర్లు ఉన్నారు. బనగానపల్లె పట్టణ సర్పంచ్‌గా బీసీ రాజారెడ్డి విశేష సేవలందించారు. ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్ది పట్టణానికే వన్నె తెచ్చారు. దీనికి తోడు ఆయన సేవా గుణం టీడీపీకి మరో బలంగా చెప్పవచ్చు. అంధులకు ప్రతి నెలా సొంత నిధులతో పింఛన్ల పంపిణీ, గోర్లగుట్ట, శ్రీఘనమద్దిలేటిస్వామి ఆలయంలో భక్తులకు సొంత ఖర్చులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. అలాగే పేదలకు ఉచితంగా పెళ్లి కానుకలు, నిరుపేదలకు ఆర్థిక సాయం, రోగులకు ఆర్థిక సాయం, అనాథలకు నిస్వార్థంగా సేవలందిస్తున్నారు. ప్రతి ఏడాది పేద విద్యార్థులకు దుస్తులు, ప్రతిభగల పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తూ వస్తున్నారు. బీసీ జనార్దన్‌రెడ్డికి రాజారెడ్డి సేవలు బాగా కలిసి వచ్చే అవకాశం ఉంది.

మాట నిలుపుకోలేని ఎమ్మెల్యే కాటసాని

హామీలు ఇచ్చి తర్వాత నెరవేర్చడంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విఫలమయ్యార్న విమర్శలు ఉన్నాయి. ఎంతో శ్రమకోర్చి బీసీ జనార్దన్‌రెడ్డి దద్దనాల ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం, సంగపట్నం ఎత్తిపోతల పథకం, చెర్వుపల్లె ఎత్తిపోతల పథకాలు తెస్తే వాటికి కనీసం ఎస్సార్బీసీ నీటి ద్వారా ఈ ప్రాజెక్టులకు సాగు, తాగునీటిని పంపింగ్ చేయలేదు. దీంతో రైతులు ఈ ఏడాది కరువుతో అల్లాడారు. అలాగే హంద్రీనీవా కాల్వ నుంచి కొచ్చెర్వు నుంచి దద్దనాల ప్రాజెక్టుకు నీరు తెస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు ఆ హామీని నెరవేర్చలేదు. కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లెలో రాయల్టీ చెక్‌పోస్టును ఎత్తివేస్తానని బహిరంగ సభలో మాట ఇచ్చారు. అది కూడా నెరవేర్చుకోలేదు. కుందూ నదిపై మినీ రిజర్వాయర్ నిర్మిస్తామని అట్టహాసంగా సీఎం జగన్ ప్రారంభం చేశారు. ఇప్పటి వరకు ఒక ఇటుక పేర్చలేదు. జోళదరాసి వద్ద మినీ రిజర్వార్ నిర్మిస్తామని సీఎం జగన్‌తో పాటు కాటసాని రామిరెడ్డి హామీ ఇచ్చారు. బనగానపల్లె పట్టణంలో ట్రాఫిక్ దృష్ట్యా రింగ్ రోడ్డు నిర్మిస్తామని చెప్పారు. అదీ నెరవేరలేదు. పెద్దకొప్పెర్ల ఎత్తిపోతల పథకం పునాదులకే పరిమితమైంది. గ్రామాల్లో సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. అవుకు జలాశయం నుంచి చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. రాయల్టీ, ధరలు, డెడ్‌రెంట్, సెక్యూరిటీ డిపాజిట్ ధరలు పెంచడంతో నాపరాయి పరిశ్రమ సర్వనాశనం అయింది. బనగానపల్లె రింగ్ రోడ్డును పట్టించుకోలేదు. సంజామల మండలంలో పాలేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో వర్షాకాలం రాకపోకలకు ప్రతిఏటా సమస్యగా మారింది. బనగానపల్లె మార్కెట్‌యార్డు గోదాముల నిర్మాణం పనులు ఆరేళ్లుగా నిలిచిపోయాయి. అలాగే బెలుంగుహలు బనగానపల్లె నియోజకవర్గంలో ఉన్నా కనీసం అవి అభివృద్ధికి నోచుకోలేదు.



సైలెన్స్...



- ఆగిన ప్రచార రథాలు.. మూగబోయిన మైకులు
- 58 రోజులుగా సాగిన ఎన్నికల సందడి
- అభ్యర్థుల తరపున ప్రముఖుల పర్యటనలు
- పాదయాత్రలు, రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు
- రేపే పోలింగ్

కర్నూలు, మే 11 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కీలకమైన ప్రచార ఘట్టానికి శనివారం సాయంత్రం ఆరు గంటలకు తెరపడింది. 58 రోజులుగా ఎన్నికల ప్రచారంలో హోరెత్తిన పట్టణ వీధులు, గ్రామాల్లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. సభలు, సమావేశాలు, రోడ్ షోలకు బ్రేక్ పడింది. ఓట్ల వేటలో కాళ్లకు చక్రాలు కట్టుకు తిరిగిన అభ్యర్థులు విశ్రాంతి తీసుకున్నారు. ఇక సైలెంట్ ప్రచారం, ఓటింగ్ వ్యూహాలపై దృష్టి పెట్టారు. జిల్లాలో కర్నూలు పార్లమెంట్ స్థానంతోపాటు కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులు ఏప్రిల్ 25న నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్ల స్వీకరణకు సై అన్నారు. 29న విత్‌డ్రా గడువు ముగిసింది. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ సహా వివిధ గుర్తింపు పొందిన పార్టీలు, స్వతంత్రులు 121 మంది బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీలైన టీడీపీ కూటమి, వైసీపీ సహా కాంగ్రెస్ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. స్వతంత్రులు కొందరు, బీఎస్పీ అభ్యర్థులు ప్రధాన పార్టీలకు దీటుగా ప్రచారం హోరెత్తించారు. టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ప్రజాగళం పేరిట, యువనేత నారా లోకేశ్ యువగళం పేరిట, హిందూపురం ఎమ్మెల్యే, యువరత్న బాలకృష్ణతో పాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితర రాష్ట్ర, జాతీయ నాయకులు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు తరపున ప్రచారం చేశారు. సభలు, రోడ్‌షోలు, కార్నర్ మీటింగుల్లో పాల్గొని ఐదేళ్ల జగన్ ప్రభుత్వం సాగించిన అకృత్యాలు, అవినీతి అక్రమాలను ఎండగట్టారు. అదే క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల రైతులకు జరుగుతున్న అన్యాయంపై విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. కూటమి మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లారు. ప్రజల నుంచి ఊహించని రెస్పాండ్ వచ్చింది. టీడీపీ శ్రేణుల్లో విజయ అవకాలపై అంచనాలు పెరిగాయి. అలాగే.. అధికార వైసీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ సైతం వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేశారు. డబ్బులు పంపిణీ చేసి జనాలను తరలించినా జగన్ ప్రసంగం మొదలు పెట్టాగానే సభా ప్రాంగణాలు ఖాళీ అయ్యాయి. చివరి రోజున ఆదోనిలో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రచారం సాగించారు. ప్రచారం పర్వం ముగియడంతో అభ్యర్థులు పోలింగ్ వ్యూహాలపై దృష్టి సారించారు. అదే క్రమంలో ఓట్ల వేటలో నోట్ల కట్టలు తెంచి విచ్చలవిడిగా పంపిణీ చేస్తున్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయండి

కర్నూలు(కలెక్టరేట్), మే 11: సజావుగా పోలింగ్ నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం పోలింగ్ సన్నద్ధత, ఓటర్ టర్న్ అవుట్ యాప్, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవో, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ జరిగే సమయంలో క్యూలైన్‌లో ఉండే ప్రజలకు ఎవరైనా భయభ్రాంతులకు గురి చేసినట్లయితే.. సంబంధిత వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి తీసుకుని వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీలకు సూచనలు జారీ చేశామన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ మొదలవుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి మూడు బెల్ ఇంజనీర్లను కేటాయించామని చెప్పారు. 1096 లోకేషన్లలో 2,204 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నాని వివరించారు. ప్రతి లోకేషన్‌లో కూడా కనీసం ఓ వీల్‌చైర్, మూడు కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఒక్కటే లోకేషన్‌లో ఉన్నట్లయితే.. రెండు వీల్ చైర్లు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టెలి కాన్ఫరెన్స్‌లో పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు ఆర్వో భార్గవ్‌తేజ, ఆదోని ఆర్వో, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ, కోడుమూరు ఆర్వో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్వో రామలక్ష్మి, ఎమ్మిగనూరు ఆర్వో చిరంజీవి, మంత్రాలయం ఆర్వో మురళి, ఆలూరు ఆర్వో రాము నాయక్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు: ఎస్పీ



నంద్యాల క్రైం, మే 11 : పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోకి ప్రవేశించే అన్ని మార్గాలు, సరిహద్దుల్లో పది చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అలాగే రెండు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, 8 అంతర్‌జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఎక్కడైనా నగదు, ఇతర వస్తువులు పంపిణీ చేస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని హెచ్చరించారు. రాత్రి గస్తీ పెంచామని, ర్యాండమ్‌గా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శాంతియుత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే నియోజకవర్గాల్లోని పెళ్లిళ్ల ఫంక్షన్‌హాళ్లు, కమ్యూనిటీ హాళ్లు, లాడ్జీలు తదితర వాటిని కూడా ట్యాప్ చేశామని, వాటిల్లో జరిగే ప్రతి చిన్న కదలికలపైన నిఘావేశామన్నారు. ఎన్నికల బందోబస్తు విధుల్లో భాగంగా ఒక ఏఎస్పీ, ఆరుగురు డీఎస్పీలు, 40మంది సీఐలు, 68 మంది ఎస్సైలు, ఏఎస్సై/హెచ్‌సీలు 318 మంది, 536 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 313 మంది హోంగార్డులు, ఏఆర్ ఫోర్స్ 144 మంది, ఏడీ సిబ్బంది 546 మంది, కర్ణాటక రాష్ట్రానికి చెందిన పోలీసులు 200 మంది, హోంగార్డులు 360 మంది, ఎస్ఏపీ సిబ్బంది 84 మంది, 13 కంపెనీల సీఆర్పీఎఫ్ సాయుధ బలగాలు కలిపి మొత్తం సుమారు 3446 మందిని నియమించామని ఎస్పీ వెల్లడించారు. వీటికితోడు కేంద్ర బలగాలు కూడా వచ్చాయన్నారు. స్ట్రాంగ్‌రూమ్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఓటర్లను రాజకీయ పార్టీకి చెందిన మద్దతుదారులు తమ వాహనాల్లో తరలించడానికి వీల్లేదని హెచ్చరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో క్యూ ఆర్ టీమ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిట్లు ఎస్పీ వివరించారు.

ఎన్నికల సామగ్రి తరలింపునకు ఏర్పాట్లు




కర్నూలు(న్యూసిటీ), మే 11: ఎన్నికల సామగిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శ్రీధర్, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. శనివారం స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్పాచ్ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ఎస్టీబీసీ కళాశాల మైదానంలో సిద్ధంగా ఉంచిన వాహనాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం డిస్పాచ్ కేంద్రం సిబ్బందికి పలు సూచనలు చేశారు.



ఎస్టీబీసీ కళాశాల మైదానంలో సిద్ధం చేసిన వాహనాలు





కందనవోలు గడ్డపై సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం తథ్యం. కర్నూలు లోక్‌సభ స్థానం సహా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో తామే గెలుస్తాం. ఐదేళ్ల జగన్ పాలనపై ప్రజలు విరక్తి చెందారు. ముఖ్యంగా జాబ్ క్యాలెండర్.. డీఎస్సీ లేక నిరుద్యోగ యువత వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. ఉద్యోగులు, మహిళలు, రైతులు, కూలీలు, కార్మికులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు 'జగన్ పోవాలి.. బాబు రావాలి' అంటున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి.. అభివృద్ధి అటకెక్కించారు. రాజధాని లేని రాష్ట్రంగా మార్చేశారు. ఇదే సమయంలో నిత్యావసర సరుకుల ధరలు.. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు రెట్టింపు అయ్యాయి. ఇసుక బంగారమైంది. దీంతో భవన నిర్మాణ రంగం కుప్పకూలింది. గడిచిన ఐదేళ్లలో ఏ వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరు. ఇలాంటి సమయంలో రాష్ట్ర చక్కదిద్దాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు రావాలి అని ప్రజలు నమ్ముతున్నారు. చంద్రబాబుపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉంది. అందుకే చంద్రబాబు పర్యటనలకు ప్రజలు పోటెత్తుతున్నారు. ఇదే క్రమంలో టీడీపీ శ్రేణులు సైతం సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాయి. ఎక్కడికి వెళ్లినా అదే చర్చ. సైలెంట్ ఓటింగ్ చాలా పవర్‌ఫుల్.. అది టీడీపీ, బీజేపీ కూటమికే అన్న స్పష్టత వచ్చేసింది. అభ్యర్థులు ప్రచారం పర్వం ముగియడంతో టీడీపీ అభ్యర్థులు ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

కర్నూలు, మే 11 (ఆంధ్రజ్యోతి):

- చంద్రబాబుపై ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం
- రాష్ట్రంలో టీడీపీ పాలన అవసరం
- జ్యాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసగించిన జగన్
- ప్రజల్లోకి దూకుడుగా సూపర్ సిక్స్ పథకాలు
- టీడీపీ ప్రచారానికి జనం బ్రహ్మరథం
- సైలెంట్ ఓటింగ్ చాలా పవర్‌ఫుల్
- ప్రచారం ముగిశాక ఆంధ్రజ్యోతితో టీడీపీ అభ్యర్థుల ఇష్టాగోష్టి

1. ప్రచారం ముగిసింది.. ప్రజల నుంచి ఎలాంటి స్పందన ఉంది?:
2. విజయంపై ధీమాగా ఉన్నారా?
3. పోల్ మేనేజ్‌మెంట్ వ్యూహాలపై దృష్టి పెట్టారా?
4. ఎమ్మెల్యేగా గెలిచాక మీరు చేయబోయే పనులపై స్పష్టమైన హామీలు వివరిస్తారా?

(ఈ ప్రశ్నలపై అభ్యర్థులు తమ సమాధానాలు వ్యక్తపరిచారు)

బాబు రావాలి..

కొండారెడ్డి బురుజుపై జెండా ఎగురవేస్తా

- కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్



● ఎలక్షన్ క్యాంపెయినింగ్ చాలా అద్భుతంగా ఉంది. ఏ వీధికి వెళ్లినా బ్రహ్మరథం పట్టారు. కర్నూలులో టీజీ గెలవాలి.. రాష్ట్రంలో చంద్రబాబు కావాలనే ఆకాంక్ష ప్రజల్లో బలంగా ఉంది. ఏ వీధికి ప్రచారానికి వెళ్లినా ప్రజలు స్వచ్ఛందంగా వచ్చారు. మహిళల్లో టీడీపీని గెలిపించాలనే ఉత్సాహం.. జోష్ కనిపిస్తుంది. ప్రధాన కారణం సూపర్ సిక్స్ వరాలు. టీడీపీ వస్తే ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాది రూ.18 వేలు, ఐదేళ్లకు రూ.90 వేలు వస్తుంది. చదువుకు పిల్లలు ఎందరు ఉన్నా ఒక్కొక్కరికి రూ.15 వేలు వస్తుంది. ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం మహిళల్లో బలంగా వెళ్లాయి. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ లేక నిరుద్యోగుల్లో ఆగ్రహం కనిపిస్తుంది. ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది.

● పాతికేళ్లుగా టీజీ కుటుంబం ప్రజల్లో ఉంది. పదవులు ఉన్నా.. లేకున్నా సొంత డబ్బుతో ప్రజా సేవ చేశాం. పైగా నేను పక్కా లోకల్. ఇక్కడే ఉంటా.. ప్రజలకు సేవలు చేస్తాను. టీజీ భరత్‌ను గెలిపించాలని ప్రజలు డిసైడ్ అయ్యారు.

● ఎన్నికల్లో పోల్ మేనేజ్‌మెంట్ ఎంతో కీలకం. జాబితాలో చనిపోయిన, శాశ్వత వలస ఓటర్లు గుర్తించాం. వాటిని తప్పకుండా అడ్డుకుంటాం. సరైన ఓటర్లే రావాలి. ఎవరైనా దొంగ ఓట్లు వేసేందుకు వస్తే ఇబ్బందులు పడుతారు.

● నేను హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు కట్టుబడి ఉన్నాను. నగరాన్ని స్మార్ట్ సిటీగా ఆధునికీకరించడం. స్వచ్ఛమైన తాగునీరు రోజూ ఇంటింటికి అందించడం, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగాలు, స్కిల్ డెవలప్‌మెంట్ స్థాపించి నైపుణ్య శిక్షణ, జాబ్‌మేళా నిర్వహిస్తాం. మహిళలకు భద్రత, ఆర్థిక భరోసా, ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి, సూపర్ సిక్స్ పథకాలు ఇంటింటికి అందించి పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తాం. మన కర్నూలు- మన హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం. ఇవి అమలు చేయకపోతే.. వచ్చే 2019 ఎన్నికల్లో ఓటు అడిగేందుకు రాను.

చేనేతల పురిలో విజయం నాదే

- ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి



● ప్రచారంలో ప్రజలే స్వచ్ఛందంగా పాల్గొని నాకు నూతన ఉత్సాహం ఇచ్చారు. పట్టణంలో ఏ కాలనీకి వెళ్లినా.. ఎమ్మిగనూరు రూరల్ మండలం, నందవరం, గోనెగండ్ల మండలాల్లో ఏ పల్లెకు వెళ్లి జన జాతరే. ఆనాడు మా నాన్న దివంగత బీవీ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, నేను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి పనులు, టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాం. ప్రజలు కూడా ఈ సైకో జగన్‌ను ఇంటికి పంపాలని కసిగా ఉన్నారు. నియోజకవర్గంలో ప్రజాగళం పేరిట మా అధినేత చంద్రబాబు, స్వర్ణాంధ్ర సాకారం పేరిట యువరత్న బాలకృష్ణ ప్రచారం నాకు బాగా కలిసొచ్చింది. ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా తాగునీటి, పారిశుధ్యం సమస్యలు నా దృష్టికి తెచ్చారు.

● విజయంపై ఎలాంటి సందేహం లేదు. తప్పక విజయం సాధిస్తాను. అసెంబ్లీలో అడుగు పెడుతాను. మా అధినేత చంద్రబాబును గౌరవ సభలోకి సగర్వంగా తీసుకెళ్లి సీఎం కుర్చీలో కూర్చోబెడుతాం. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. చేనేతలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు. బీసీలు, ఎస్సీలు, మైనార్టీలు.. అన్ని వర్గాల ప్రజలు టీడీపీకి అండగా నిలిచారు. బీవీ మోహన్‌రెడ్డి కొడుకును గెలిపించాలని ప్రజలు చాలా స్పష్టంగా ఉన్నారు.

● పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాం. బూత్ స్థాయి నుంచి మా కార్యకర్తలు సైనికుల్లా పని చేస్తున్నారు. నా గెలుపు కోసం అంతలా వారు కృషి చేస్తున్నారంటే వారి రుణం ఈ జన్మలో తీర్చుకోలేనిది.

● చేనేతలకు ఉపాధి, ఉద్యోగాలు లక్ష్యంగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు, ఆగిపోయిన ఆర్డీఎస్ కుడి కాలువ, అసంపూర్తిగా వదిలేసిన ఎమ్మిగనూరు పట్టణంలో వంద పడకల ఆస్పత్రిని పూర్తి చేస్తా. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, జీడీపీ నుంచి తాగునీటి పైపులైన్, గోనెగండ్ల మండలంలో 17 గ్రామాలు రక్షిత మంచినీటి పథకం పూర్తి చేస్తా. పేదలకు టిడ్కో ఇళ్ల పంపిణీ, ప్రతి పేదవాడికి 2-3 సెంట్లు ఇంటి స్థలం, పక్కా ఇల్లు నిర్మాణం, ఎమ్మిగనూరు పట్టణం రింగ్‌రోడ్డు నిర్మాణం, మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు రైల్వే లైన్ నిర్మాణం, ఎమ్మిగనూరు-కోడుమూరు వయా గోనెగండ్ల ప్రధాన రహదారిని జాతీయ రహదారిగా ఆధునికీకరణకు కృషి చేస్తా. ఆర్డీఎస్ కాలువ, టెక్స్‌టైల్ పార్కు, ఇంటింటికి రోజు తాగునీరు మా మా నాన్న బీవీ మోహన్‌రెడ్డి కల.. కొడుకుగా ఆ కల సాకారం చేసే బాధ్యత నాది.

ప్యాణంలో టీడీపీ జెండా ఎగురేస్తాం

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత



● గతంలో కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించాం. అయితే.. ఈ ఎన్నికల ప్రచారం సుదీర్ఘంగా 58 రోజులు జరిగింది. నాలుగో విడతలలో పోలింగ్ నిర్వహించడమే ఇందుకు కారణం. కల్లూరు అర్బన్ వార్డులు సహా పాణ్యం, ఓర్వకల్లు, గడివేములు, కల్లూరు మండలాల్లో ఏ గ్రామానికి వెళ్లినా జనం హారతులు పట్టారు. మా ఇంటి ఆడపడుచు అంటూ ఆప్యాయంగా పలకరించారు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అవినీతి అక్రమాలును ప్రజల్లోకి తీసుకెళ్లాం. టీడీపీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు బాగా చేరువయ్యాయి.

● ప్రజల నుంచి వచ్చిన ఆదరణ అమోఘం. జగన్‌ను ఇంటికి పంపాలని ఉద్యోగులు, రైతులు, యువత, వ్యాపారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రచారంలో మాకు అదే విషయం చెప్పారు. అదే క్రమంలో ఎమ్మెల్యే కాటసాని భూకబ్జాలు, దౌర్జన్యాలపై ప్రజలు విరక్తి చెందారు. ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదు. మార్పు కోరుకుంటున్నారు. పక్కాగా విజయం మాదే.

● అధికార వైసీపీ నాయకులు పోలింగ్ రోజున దౌర్జన్యాలకు పాల్పడే అవకాశం ఉంది. దానిని సమర్థవంతంగా ఎదుర్కొంటాం. మా కార్యకర్తలు, జనసేన సైనికులు సిద్ధంగా ఉన్నారు. ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి పోలింగ్ సజావుగా జరిగేలా చూస్తాం.

● కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో రోజు తాగునీరు, శివారు కాలనీల్లో మెరుగైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం, గ్రామాల్లో సీసీ రోడ్లు, ప్రధాన రహదారులు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. అలగనూరు, గోరుకల్లు రిజర్వాయర్లు మరమ్మతులు చేయిస్తాం. గడివేముల మండలం వెలగమాను ఫీడర్ ఛానల్ మరమ్మతులు చేయించి ఆరు వేల ఎకరాలకు సాగునీరు. ఓర్వకల్లు పారిశ్రామివాడలో పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు, హంద్రీనీవా కాలువపై లిఫ్ట్ పెట్టి ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో ఆయా గ్రామాలకు సాగు, తాగునీరు ఇస్తాం. పాణ్యం చెరువు ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటాం.

రాఘవేంద్రుడి ఆశీస్సులతో విజయం సాధిస్తా

- మంత్రాయలం టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి



● ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. టీడీపీ అధినేత చంద్రబాబు బీసీలపై నమ్మకంతో ఓ బీసీకి టికెట్ ఇచ్చారు.. గెలిపించి చంద్రన్నకు కానుకగా ఇవ్వాలని ప్రజలే అంటున్నారు. మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాం. అదే క్రమంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఒక్క అభివృద్ధి చేయలేదు. దౌర్జన్యాలు, దోపిడి, ఇసుక, మద్యం మాఫియాను పంచి పోషించాడు. మండలాల్లో బీసీ ప్రజాప్రతినిధులు ఉంటే.. రెడ్లను ఇన్‌చార్జిలుగా పెట్టి బీసీలను రాజకీయంగా అణగదొక్కారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టులు జలాశయాలు, పులికనుమ రిజర్వాయర్, చిన్నతుంబళం చెరువులను చేపల చెరువులుగా మార్చేసి రైతులకు కన్నీళ్లు మిగిల్చారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాం.

● నా గెలుపు ఖాయమైంది. బీసీ అభ్యర్థికి ఒక్క చాన్స్ ఇవ్వాలని బీసీలు, ఎస్సీలు, మైనార్టీలు, ఓసీలు అన్ని వర్గాల ప్రజలు సిద్ధం అయ్యారు. అందులో ఏ సందేహం లేదు. 20 వేల ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధిస్తాను. బీసీలపై నమ్మకంతో టికెట్ ఇచ్చిన చంద్రబాబుకు కానుకగా ఇస్తాం.

● తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేయడం వల్ల పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాను. టీడీపీ, జనసేన సైనికులు పక్కా వ్యూహాలతో ముందుకు వెళ్తాం.

● ఆర్డీఎస్ కుడి కాలువ పూర్తి చేస్తాం. గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలకు నిర్వహన నిధులు తెప్పించి ఎల్లెల్సీ చివరి ఆయకట్టుకు సాగునీరు ఇస్తాను. ప్రతి గ్రామంలో ఇంటింటికి కుళాయి, అదనపు ఎస్ఎస్ ట్యాంకులు నిర్మాణం. మంత్రాలయం, కౌతాళం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల్లో పేదలకు 3 సెంట్లు ఇంటి స్థలం. పక్కా ఇల్లు నిర్మిస్తాను. గ్రామాలకు ప్రధాన రోడ్లు నిర్మాణం చేస్తాం. ముఖ్యంగా మండలాల్లో ఇన్‌చార్జి వ్యవస్థలు లేకుండా మండల ప్రజాప్రతినిధులకే స్వేచ్ఛ, సర్వ అధికారలు ఇస్తాను. మంత్రాలయం సహా అన్ని మండల కేంద్రాల్లో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తాను.

విజయం సాధిస్తా.. అసెంబ్లీలో అడుగు పెడతా

- ఆలూరు టీడీపీ అభ్యర్థి బి.వీరభద్రగౌడ్



● మా అధినేత చంద్రబాబు నాకు టికెట్ చివర్లో ప్రకటించారు. సమయం తక్కువ ఉన్నా.. ప్రచారంలో చురుగ్గా ప్రజల్లోకి వెళ్లాం. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంపూర్ణ సహకారం అందించారు. ప్రజల్లో ఇంతటి స్పందన ఎప్పుడూ చూడలేదు. ఆలూరు, హొళగుంద, హాలహర్వి, దేవనకొండ, ఆస్పరి, చిప్పగిరి ఏ మండలానికి వెళ్లినా టీడీపీని గెలిపించుకోవడానికి ప్రజలు సన్నద్ధమై వచ్చారు. ప్రజల నుంచి ఊహించని అపూర్వ స్పందన వచ్చింది. మా అధినేత చంద్రబాబు ప్రజాగళం సభ మాకు మరింతగా తోడ్పడింది.

● టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలు సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాం. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని ప్రజలు ఎంతో కసిగా ఉన్నారు. వాల్మీకీ, కురవ, యాదవ, దళితులు, బీసీలు, మైనార్టీలు.. అన్ని వర్గాల ప్రజలు టీడీపీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు. ఏ ఇంటికి వెళ్లినా కుటుంబ సభ్యుడిలా ఆహ్వానించారు. సందేహమే లేది గెలిచి అసెంబ్లీకి వెళ్తా.

● పోలింగ్ రోజున అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు, దొంగ ఓట్లు టీడీపీ, జనసైనికులు సమర్థవంతంగా ఎదుర్కొంటారు. ఇందులో ఏ మాత్రం అనుమానం లేదు. మేము ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు సాగుతాం. వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు దిగితే మన కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. దొంగ ఓట్లు, సైక్లింగ్ విధానాలను అడ్డుకునేందుకు పక్కాగా వ్యూహం సిద్ధం చేశాం.

● టీడీపీ ప్రభుత్వంలో రూ.1,942 కోట్లతో చేపట్టిన వేదవతి ప్రాజెక్టు వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. ఆ ప్రాజెక్టు సహా నగరడోణ జలాశయం పూర్తి చేస్తాను. ఆలూరు సహా ప్రతి గ్రామంలో తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ప్రధాన రహదారులు నిర్మాణం. హంద్రీనీవా నుంచి చిప్పగిరి, దేవనకొండ, ఆస్పరి మండలాలకు, ఎల్లెల్సీ కాలువ నుంచి ఆలూరు, హలహర్వి, హొళగుంద మండలాలకు తాగునీరు అందిస్తాను. అసంపూర్తిగా ఉన్న హంద్రీనీవా కాలువలు పూర్తి చేసి దేవనకొండలో సాగునీరు, ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునికీకరణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనాలు, నిర్మించి విద్యార్థులకు అండగా నిలుస్తాను. దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి క్షేత్రం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాను.

టీడీపీని గెలిపించాలని ప్రజలు సిద్ధమయ్యారు

- పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు



● పత్తికొండ నియోజకవర్గంలో ప్రచారంలో ప్రజలు నుంచి అనుహ్య స్పందన వచ్చింది. ఏ గ్రామానికి వెళ్లినా జనం జాతరలా తరలివచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో నాన్న కేఈ కృష్ణమూర్తి డిప్యూటీ సీఎంగా చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాను. అదే క్రమంలో వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాం.

● ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తే పత్తికొండ కోటపై జెండా పాతేస్తామనే ధీమా వచ్చింది. ఎమ్మెల్యే శ్రీదేవి, వైసీపీ నాయకులు అవినీతి అక్రమాలపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతో ఉన్నారు. అదే క్రమంలో టీడీపీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి.

● పోల్ మేనేజ్‌మెంట్ మాకు కొత్త కాదు. పోలింగ్ రోజున వైసీపీ ఎలాంటి అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం.

● కృష్ణగిరి, తుగ్గలి, పత్తికొండ, మద్దికెర మండలాల్లో హంద్రీనీవా కాల్వ నుంచి 68 చెరువులకు నీటితో నింపుతాం. పేదలకు 3 సెంట్లు ఇంటి స్థలం, పక్కా ఇల్లు నిర్మిస్తాం. టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాను.

కోడుమూరులో టీడీపీ జెండా పాతేస్తాం

- కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి



● స్థానికుడైన (లోకల్) అభ్యర్థి దస్తగిరిని గెలిపించుకోవాలని ప్రజలు అంటున్నారు. టీడీపీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజులతో కలసి గ్రామాల్లో ప్రచారానికి వెళ్తే.. ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు బ్రహ్మరథం పట్టారు. మంచి స్పందన వచ్చింది. మా పార్టీ అధినేత చంద్రబాబు గూడూరులో నిర్వహించిన ప్రజాగళం సభ సూపర్ సక్సెస్ కావడం కలిసొచ్చిన అంశం.

● ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇసుక, మట్టి, మద్యం మాఫియాదే రాజ్యం. ఏ ఒక్క అభివృద్ధి పని చేయలేదు. ఆ వివరాలను ప్రజలకు వివరించాం. ప్రజలు కూడా వైసీపీ ప్రభుత్వంపై పూర్తిగా విరక్తితో ఉన్నారు.

● ఎన్నికల్లో పోల్ మేనేజ్‌మెంట్ ఎంతో కీలకం. ఆ మేరకు అన్నిరకాల ఏర్పాట్లు చేసుకున్నాం.

● తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి జీడీపీ నుంచి పైపులైన్, ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇస్తా. గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి చర్యలు. గురురాఘవేంద్ర లిఫ్టుల మరమ్మతులు చేయిస్తాను.

విజయం సాధిస్తా.. పార్లమెంట్‌లో అడుగు పెడతా

కర్నూలు ఎంపీ టీడీపీ అభ్యర్థి బస్తి పాటి నాగరాజు



● ఏడు నియోజకవర్గాల్లో ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బీసీలు, మైనార్టీలు, దళితులు.. అన్ని వర్గాల ప్రజలు అక్కున చేర్చుకున్నారు. టీడీపీ గెలుస్తుందని మాలో భరోసా.. జోష్ నింపారు. మండుటెండల్లో సైతం ప్రజలు అండగా నిలవడం మా అదృష్టం. మా అధినేత, మాజీ సీఎం చంద్రబాబు, నందమూరి బాలకృష్ణ, యువనేత లోకేశ్, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ప్రచారం ఎంతగానో కలిసొచ్చింది. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

● జిల్లాలో ఎంపీ సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులే విజయం సాధిస్తారు. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. కూటమి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలు మహిళలకు బాగా కనెక్ట్ అయ్యాయి. యువత, ఉద్యోగులు, మహిళలు, రైతులు.. అన్ని వర్గాల ప్రజలు జగన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. టీడీపీ కూటమిని గెలిపించేందుకు సిద్ధమయ్యారు. మా గెలుపు ఖాయం.

● ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి మేనేజ్‌మెంట్ ఎంతో కీలకం. ఎమ్మెల్యే అభ్యర్థులతో కలసి సమన్వయంతో అధికార పార్టీ దౌర్జన్యాలు అడ్డుకోవడానికి పక్కా ప్రణాళిక రచించాం.

● గుండ్రేవుల ప్రాజెక్టు సాధిస్తాను. అసంపూర్తిగా వదిలేసిన వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడి కాలువ పూర్తి చేయడం, సుంకేసుల జలాశయం ఆధునికీకరణ ప్రాధాన్యతగా తీసుకుంటాను. మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు రైల్వే నిర్మాణం, పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పన, రైల్వే కోచ్ పరిశ్రమలను పూర్తి చేడయం, కోడుమూరు పట్టణానికి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఎస్ఎస్ ట్యాంక్, జీడీపీ నుంచి పైపులైన్, ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు కృషి చేస్తాను.

మహానందిలో కర్ణాటక హైకోర్టు జడ్జి



మహానంది క్షేత్రంలో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ బసవరాజు

మహానంది, మే 11: మహానంది క్షేత్రంలో శనివారం కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ జి. బసవరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయం ముఖద్వారం వద్ద ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో వీరిని ఆలయ వేదపండితులు శాలువాతో సన్మానించి, స్వామివారి ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఏఈవో ఎర్రమల్ల మధు, సిబ్బంది పాల్గొన్నారు.

'జగన్ జైలుకు వెళ్లడం ఖాయం'



మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

పగిడ్యాల, మే 11: ఎన్నికలు ముగిసిన తరువాత జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పగిడ్యాలలో టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరితో కలిసి శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక రౌడీయిజం, దాడులు, బెదిరింపులు తప్ప అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. రాష్ట్రానికి రాజదాని లేకుండా చేసిన ఘనత జగన్‌కే దుక్కుతుందన్నారు. మూడు రాజధానుల పేరుతో ప్రజలను మభ్యపెట్టడం తప్ప ఏమీ చేయలేదన్నారు. గతంలో తాను పేదవారికి 4 సెంట్ల స్థలం ఇచ్చానని, ఆ స్థలాన్ని వైసీపీ నాయకులు లాక్కొని ఒక సెంటు స్థలం ఇచ్చి ప్రచారం చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించామన్నారు. తెలంగాణ, ఏపీలోని నీటి ముంపు నిర్వాసితుల సంఘం అధ్యక్షుడిగా ఉండి ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని, ప్రాజెక్టులో పొలాలు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించేలా కృషి చేశామన్నారు. ఎంపీ అభ్యర్థి బైరెడ్డి డా.శబరి మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పారు. నాయకులు అల్లీవుసేన్, శ్రీనివాసనాయుడు, జయరామిరెడ్డి, రమణ ఉన్నారు.

'కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి'



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, మే 11: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నంద్యాల ఎంపీ అభ్యర్థి లక్ష్మీనరసింహయాదవ్ అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బెన్నికాంప్లెక్స్, పోలీస్ క్వార్టర్స్, చాబోలు క్రాస్ రోడ్, అశోక్‌నగర్, రైతునగరం పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. లక్ష్మీనరసింహయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వృద్ధులకు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ అందించనున్నట్లు తెలిపారు. 9 గ్యారెంటీలను అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీశైలం అభివృద్ధికి కృషి: బుడ్డా



పెచ్చెర్వులో గిరిజనులతో సమావేశమైన బుడ్డా

ఆత్మకూరు, మే 11: ఎన్నికల ప్రచారంలో ప్రజలు చూపిన ఆదరణను ఎప్పటికీ మరువలేనని, శ్రీశైల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ దుష్ట పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అసమర్థతను ఇక్కడి ప్రజలు గుర్తించారని అన్నారు. అలాగే టీడీపీ, బీజేపీ పొత్తుపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ముస్లింలు నమ్మే పరిస్థితుల్లో లేరని, దీంతో టీడీపీలోకి చేరికలు ఎక్కువగా జరిగాయని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా శ్రీశైలంలో పసుపు జెండా ఎగరడం ఖాయమన్నారు. గ్రామాల్లో సాగు, తాగునీరు, శ్మశానాల ఏర్పాటు, పంటపొలాలకు రస్తాలు, ఇతర మౌలిక సదుపాయాలను తన దృష్టికి వచ్చాయని, అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ పరిష్కరిస్తానని తెలిపారు. వరదరాజ స్వామి ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణాజలాలను అందించేందుకు పాటుపడుతానని చెప్పారు. అలాగే గెలిచిన 9 నెలల్లోగా తెలుగుగంగ లైనింగ్ పనులను పూర్తిచేయించి ఆయకట్టు పొలాలకు రెండుకార్లు సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. సిద్దాపురం ఎత్తిపోతలు, నాన్ అమృత్ వాటర్ స్కీం వంటి పథకాల పెండింగ్ పనులను కూడా పూర్తిచేయిస్తానని వివరించారు. అనంతరం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతులను దహనం చేశారు.

పెచ్చెర్వులో తొలిసారిగా ఎన్నికల ప్రచారం

పెచ్చెర్వు చెంచుగూడేంలో తొలిసారిగా ఎన్నికల ప్రచారం జరిగింది. వాస్తవానికి శతాబ్దాల చరిత్ర కలిగిన పెచ్చెర్వులో 2014 వరకు పోలింగ్ కేంద్రం ఉండేది కాదు. ఎన్నికల్లో ఓటే వేయాలంటే వారు ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెరువు చెంచుగూడేనికి చేరుకుని ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన పరిస్థితులు ఉండేవి. అయితే 2014లో అప్పటి కలెక్టర్ సుదర్శన్‌రెడ్డి పెచ్చెర్వు గిరిజనుల ఓటు కష్టాలను గుర్తించి తొలిసారిగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుకు కృషి చేశారు. అయితే అప్పటి నుంచి జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భాల్లో ఏ ఒక్క అభ్యర్థి కూడా పెచ్చెర్వుకు వెళ్లి ఎన్నికల ప్రచారాలను నిర్వహించిన దాఖలాల్లేవు. ప్రస్తుతం 203 మంది ఓటర్లు పెచ్చెర్వు గూడెంలో ఉన్నప్పటికీ 10వ తేదీ వరకు ఒక్క అభ్యర్థి కూడా గూడేన్ని కన్నెత్తి చూడలేదు. కానీ శ్రీశైలం అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈక్రమంలోనే శనివారం పెచ్చెర్వు చెంచుగూడేన్ని ప్రత్యేకంగా గుర్తించుకుని మరీ సందర్శించారు. అక్కడి చెంచులతో మమేకమై వారి కష్టాలను తెలుసుకున్నారు. విల్లంబులను, వారి ఆయుధాలను అందించారు. బుడ్డా విల్లంబులు వదలి వారితో ఆనందాన్ని పంచుకున్నారు. బుడ్డా కుమార్తె డాక్టర్ మేఘనరెడ్డి, అల్లుడు సాయి జయంత్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఉన్నారు.

'చెంచుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తా'

నల్లమల చెంచుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు కృషిచేస్తానని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేకించి శ్రీశైలం నియోజకవర్గంలోని చెంచుగూడేల్లోని గిరిజనులందరికీ పక్కా గృహాలను నిర్మించేందుకు కృషిచేస్తానని తెలిపారు. సంక్షేమ పథకాలను అందించడంతో పాటు పింఛన్ సదుపాయాన్ని కల్పించనున్నట్లు వివరించారు. అలాగే శ్రీశైలం ఐటీడీఏను ప్రక్షాలను చేసి అర్హులైన చెంచులందరికి సంక్షేమ ఫలాలను అందించేందుకు, మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పాటునందిస్తానని తెలిపారు. ప్రత్యేకించి అటవీ అనుమతులతో పెచ్చెర్వు గూడెంలో కూడా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. చెంచులు సారా అలవాటను దూరం చేసుకోవాలని, పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. చెంచులకు జీవనోపాధుల కల్పనకు కూడా తనవంతు కృషి తప్పక చేస్తానని హామీ ఇచ్చారు.

'టీడీపీ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి'

మహానంది: టీడీపీ హయాంలోనే గిరిజనులు అభివృద్ధి చెందారని బుడ్డా శైలజ అన్నారు. శనివారం సాయంత్రం మహానంది సమీపంలోని గిరిజన కాలనీలో ప్రచారం చేశారు. మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను బుడ్డా శైలజ దృష్టికి తీసుకొచ్చారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రామలింగారెడ్డి, నూరే శ్రీనివాసులు పాల్గొన్నారు.



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతులను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా



పెచ్చెర్వులో తాగునీటి బావిని పరిశీలిస్తున్న బుడ్డా



మహానందిలో ప్రచారం చేస్తున్న బుడ్డా శైలజ

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం: మాండ్ర

నందికొట్కూరు, పగిడ్యాల మే 11: టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు అభ్యర్థి గిత్తా జయసూర్య శనివారం ముచ్చుమర్రిలో రోడ్ షో నిర్వహించారు. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఇంటి వద్ద వైసీపీ కార్యకర్తలు ఉండడంతో నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఆర్‌పీసీఎఫ్ పోలీసు బలగాలు అప్రమత్తమై భారీ భద్రత ఏర్పాటు చేశారు. మాండ్ర మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, నియోజకవర్గంలో ఉన్న రౌడీషీటర్లంతా జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. టీడీపీ హయాంలో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నిర్మించడం ద్వారానే కేసీ కాలువ కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందుతోందన్నారు. వైసీపీ హయాంలో నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ పనులు ఏమి జరిగాయో? ప్రజలు ప్రశ్నించుకోవాలని సూచించారు. కొణిదేల క్రాస్ నుంచి ముచ్చుమర్రి వరకు వచ్చే రోడ్డు గుంతలమయంగా మారిందని, సొంత గ్రామానికి బీటీ రోడ్డు వేయించుకోలేని స్థితిలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఉన్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ముచ్చుమర్రి గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తుందన్న విషయం జగన్‌కు అర్థమైందని, అందుకే ఎక్కడ జైల్లో పెడతారోనన్న భయంతో విదేశాలకు వెళ్లేందుకు టిక్కెట్లు బుక్ చేసుకున్నారని ఆరోపించారు. ఇక లోకల్ యూట్యూబ్ స్టార్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఎక్కడికి వెళ్తారో చూడాలన్నారు. స్థానికుడు ఎమ్మెల్యే కావడం బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి ఇష్టం లేదని, అందుకే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మాల, మాదిగలు అంటే వేరు కాదని, రెండు వర్గాలు కలగలిసిన ఐదు వేళ్లు అని అన్నారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గంలోని దళితులంతా పిడికిలి బిగించబోతున్నారని, ఈ పిడికిలిలో వైసీపీ ఊపిరాకకొట్టుమిట్టాడడం ఖాయమని జయసూర్య అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమంతో పాటు అభివృద్ధికూడా చేసి చూపుతామన్నారు. ఎంపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరిని, తనను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. పార్టీ మండల కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, మాండ్ర లింగారెడ్డి, బండి జయరాజు, రమణా రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, గిరీశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అల్లూరులో మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిన మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి తదితరులు

'వైసీపీని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధం'

నందికొట్కూరు రూరల్: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగించిన వైసీపీని ఇంటింటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నంద్యాల పార్లమెంట్ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో శనివారం మాండ్ర సమక్షంలో బ్రాహ్మణకొట్కూరు సింగిల్ విండో మాజీ చైర్మన్ మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అదేగ్రామ టీడీపీ నాయకులు జయరామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఖాజామొయిద్దీన్ ఆధ్వర్యంలో మాండ్ర, జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో డాక్టర్ మాలిక్, జాఫర్ తదితరులు ఉన్నారు. మాండ్ర మాట్లాడుతూ జగన్ ఉద్యోగులను, నిరుద్యోగులను, రైతులను ఇలా అన్ని రంగాల ప్రజలను మోసం చేశారని అన్నారు. అందుకే ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని, ఓటుతో జగన్‌కు బుద్ధిచెబుతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ప్రాగటూరు గ్రామంలో ప్రచారం చేశారు.



ముచ్చుమర్రిలో హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

టీడీపీలో చేరిక

నందికొట్కూరు పట్టణ 19 వార్డు వైసీపీ నాయకులు కొప్పుల వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణ, సాయి, పుల్లారెడ్డి, శివ, వెంకటేష్ తదితరులు మాండ్ర శివానందరెడ్డి, జయసూర్యల సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముచ్చుమర్రిలో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి



ముచ్చుమర్రిలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న లింగారెడ్డి

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేసిన కళాకారులు

శ్రీశైలం, మే 11: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శనివారం హైదరాబాద్‌కు చెందిన సింధు శ్యామ్ గ్రంధి బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయక కౌత్వం, గంగాధరశివ, జతిస్వరం, మూషికవాహన, శివోహం తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు

గడివేముల, మే 11: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ జమానుల్లాఖాన్, ఎంపీడీవో శివరామిరెడ్డి, మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి, ఈవోఆర్డీ అబ్దుల్‌కాలిక్ తనిఖీ చేశారు. ఓటర్లను ఆకర్షించేందుకు మండలంలో మోడల్ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పోలింగ్ కేంద అన్ని సౌకర్యాలు ఉంటాయని అన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.

14న మహానందిలో గంగాదేవి పుష్కరోత్సవం

మహానంది, మే 11: మహానంది క్షేత్రంలో ఈనెల 14న గంగాదేవి పుష్కరోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. గంగాదేవి పుట్టిన రోజున మహానందిలో పుష్కరోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజు మహానందిలోని రుద్రగుండం కోనేరులో గంగాదేవి పుణ్య స్నానాలు ఆచరించినట్లు పురాణాల్లో ఉందని ఆలయ వేదపండితుడు రవిశంకర్ అవధాని తెలిపారు. భక్తులు గంగాదేవి పుష్కరోత్సవం రోజు క్షేత్రంలోని రుద్రగుండం కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి పునీతులు కావాలని కోరారు.

వేటగాళ్లను తీసుకెళ్తుండగా అడ్డుకున్న బంధువులు

మహానంది, మే 11: మహానంది సమీపంలోని నల్లమల అడవిలో ఇటీవల వన్యప్రాణిని హతమార్చిన కేసులో వేటగాళ్లను కోర్టుకు హాజరు పరచకూడదని నిందితుల బంధువులు అటవీశాఖ వాహనాన్ని అడ్డుకొన్నారు. శనివారం పట్టుబడ్డ ఐదుగురు నిందితులను స్థానిక పర్యావరణ విద్యా కేంద్రం నుంచి అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచడానికి అటవీశాఖకు చెందిన జీపులో నంద్యాలకు తీసుకెళ్తుండగా వేటగాళ్ల బంధువులు అడ్డుకున్నారు. మహానంది దేవస్థానం చెక్‌పోస్టు వద్ద జీపును అటకాయించారు. కణతి హతమార్చిన కేసులో మహానందికి చెందిన ప్రధాన సూత్రధారిని అరెస్ట్ చెయ్యకుండా అటవీశాఖలోని కొంతమంది సిబ్బంది తప్పించే ప్రయత్నం చేస్తున్నారని, సిబ్బంది పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా వేటగాళ్లను కూడా అరెస్ట్ చేసి తమ వారిని కూడా అప్పుడు కోర్టుకు హాజరుపచ్చాలని అన్నారు. గంటపాటు సిబ్బందికి, పట్టుబడిన వేటగాళ్ళ బంధువులకు వాగ్వాదం జరిగింది. చివరకు వారికి నచ్చచెప్పి ఈ కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురు వేటగాళ్లను అరెస్ట్ చేస్తామని నచ్చచెప్పి కోర్టుకు హాజరుపర్చగా మేజిస్ట్రేట్ ఐదుగురు వేటగాళ్లను రిమాండ్‌కు ఆదేశించారు.

ఉద్యోగి సస్పెన్షన్‌కు సిఫారసు

నందికొట్కూరు రూరల్, మే 11: అధికార పార్టీ వైకాప తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేసీ కెనాల్ ఉద్యోగిని విధుల నుంచి తప్పించేందుకు సంబంధిత అధికారులకు సిఫారసు చేసినట్లు నందికొట్కూరు ఎన్నికల ఇటర్నింగ్ అధికారి దాసు తెలిపారు. నందికొట్కూరు మండలంలోని నాగటూరు గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి కేసీ కెనాల్ నందికొట్కూరు సెక్షన్ కార్యాలయంలో సబ్ ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. ఆయన గత వారం రోజులుగా అధికార పార్టీ తరపున శాప్ చైర్మన్ సిద్దార్థరెడ్డి, నందికొట్కూరు వైసీపీ అభ్యర్థి దారా సధీర్ వెంట ప్రచారం చేశారు. ఆయనపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపించాయి. తహసీల్దార్ ఎన్నికల విధులను అప్ప చెప్పినా వెళ్లకుండా అధికార పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఎవరికీ భయపడకుండా భహిరంగగంగానే పార్టీ ప్రచారాలలో పాల్గొంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎట్టకేలకు నందికొట్కూరు ఎన్నిల రిటర్నింగ్ అధికారి దాసు సంబంధిత నీటిపారుదల శాఖాధికారులకు విధుల నుంచి తొలగించేందుకు సిఫారస్ చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారపార్టీకి కొమ్ము కాస్తున్న ప్రభుత్వ ఉద్యోగిపై గట్టిచర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గ్రామాల్లో టీడీపీ ప్రచారం

శ్రీశైలం, మే 11: శ్రీశైలం గ్రామంలో శనివారం టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ శ్రీశైలం ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి, నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మహిషాసురమర్థిని అమ్మవారికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో రోడ్ షో నిర్వహించారు.

మహానంది: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మహానంది మండల మాజీ ఎంపీపీ చింతం నాగమణి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు శనివారం మహానంది మండలం గోపవరంలో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. విజన్ గల నేత చంద్రబాబు అని, రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్ కావాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హిమబిందు, కళ్యాణి, గురమ్మ పాల్గొన్నారు.

కొత్తపల్లి: చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ప్రజా పరిపాలన సాధ్యమని టీడీపీ నాయకులు శివారెడ్డి, మల్లయ్య అన్నారు. పెద్దగుమ్మడాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. అలాగే టీడీపీ నాయకులు నాగశేషన్న, గంగన్న ఆధ్వర్యంలో గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ జగన్ ఒక్క చాన్స్ పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, మళ్లీ జగన్ గెలిస్తే.. రాష్ట్రాన్ని తాకట్టు పెడతారని అన్నారు. ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిని, ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్యను గెలిపించాలని కోరారు. శ్రీనివాసనాయక్, శంకర్‌రావు, పక్కిరెడ్డి, శ్రీరాములు, కురుమయ్య, రాజు, రాము పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి మృతి

పాణ్యం, మే 11: పాణ్యంలోని విజయానికేతన్ పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి కొండపోగు యేసయ్య మృతి చెందినట్లు పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపారు. హైదరాబాద్‌కు చికిత్స కోసం వెళ్లి తిరిగి వస్తుండగా పాణ్యం వద్ద ఫ్లైఓవర్ ఎక్కుతుండగా ఎదురుగా వెళ్తున్న లారీ అధిక లోడుతో ఎక్కలేక వెనక్కి రావడంతో కారును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మహానంది మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన యేసయ్య తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ముగిసిన ప్రచారం

నందికొట్కూరు, మే 11: 2024 సార్వత్రిక ఎన్నికల ప్రధాన గట్టమైన ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. నామినేషన్ ముగిసిన నాటి నుంచి 12 రోజుల పాటు సాగిన ప్రచారంలో ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటూ ప్రచారం జోరుగా సాగింది. నందికొట్కూరు నియోజకవర్గంలో 251 పోలింగ్ కేంద్రాల్లో 2,18,047 మంది ఓటర్లు ఉండగా అందులో 1,06,689 మంది పురుషులు, 1,11,340 మంది స్త్రీలు, 18 మంది ఇతరులు ఉన్నారు. 251 పోలింగ్ కేంద్రాల్లో 38 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. అక్కడ భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం శ్లోకా స్కూల్‌లో ఉదయం 9 గంటలకు డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను ప్రారంభిస్తారు. పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వలర్లు 2,500 మంది, ఇతర ఎన్నికల సిబ్బంది 1500 మొత్తం 4 వేల మంది సిబ్బంది ఈ ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. ఉదయం పోలింగ్ ప్రక్రియపై ఆర్వో పలు సూచనలు చేసిన అనంతరం సాయంత్రం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఎన్నికల సిబ్బంది తరలివెళ్తారు. నందికొట్కూరుకు భారీగా ఆర్పీసీఎఫ్ బలగాలు భారీగా మొహరించాయి.

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో ఈ నెల 13వ తేదిన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 1,96,116 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ మేరకు ఫైనల్ ఓటరు జాబితా ప్రకారం నియోజకవర్గంలో శ్రీశైలం, ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో 226 పోలింగ్ కేంద్రాల్లో 1,96,116 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 95,771 మంది పురుష ఓటర్లు ఉండగా 1,00,301 మంది మహిళా ఓటర్లు, 44 ఇతర ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో శ్రీశైలం మండలంలో 22,865 మంది ఓటర్లు, ఆత్మకూరు మండలం(ఆత్మకూరు మున్సిపాలిటీతో సహా)లో 63173, వెలుగోడులో 42344, బండిఆత్మకూరులో 37,974, మహానందిలో 29760 మంది ఓటర్లు ఉన్నట్లు జాబితాను సిద్ధం చేశారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

పట్టు నిలుపుకున్న కూటమి

● జేపీ నడ్డా సభ విజయవంతం
● భారీగా తరలివచ్చిన టీడీపీ-బీజేపీ-జనసేన కార్యకర్తలు



అభివాదం చేస్తున్న జేపీ నడ్డా, డాక్టర్ పార్థసారథి

ఆదోని (అగ్రికల్చర్), మే 11: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదోనిలో చేపట్టిన ప్రజాగళం ఎన్నికల ప్రచారం విజయవంతం అయింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జన సమీకరణలో తమ పట్టుని నిలుపుకుంది. గ్రామాల నుంచి పట్టణంలోని ఆయా వార్డుల నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మున్సిపల్ క్రీడా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభ మైదానమంతా పసుపు, కాషాయపు, జనసేన జెండాలతో రెపరెపలాడింది. అసెంబ్లీ అభ్యర్థి పార్థసారథి, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటు నాగరాజు కార్యక్తలను చూసి ఉప్పొంగి పోయారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మైదానంలోని కార్యకర్తలను చూసి తన ప్రసంగంలో విజయం ఖాయమని మెజారిటీనే తేలాలని ప్రస్తావించారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి గెలుస్తుందని, ఆదోనిలో బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారది గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. భారీ మెజారిటీ రావాలంటే ఖచ్చితంగా ప్రతి ఒక్కరూ ఎన్డీఏ అభ్యర్థి కమలం గుర్తుకే ఓటు వేయించాలని సూచించారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

● ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ఆదోని, మే 11: ఈనెల 13న జరగబోయే ఎన్నికలకు సర్వం సిద్ధమని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. శనివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఆదివారం జరిగే డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు, అందులో రూరల్ 97, అర్బన్ 159 కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఓటరు పై వైసీపీ నాయకుల దాడి

ఆస్పరి, మే 11: మండల కేంద్రంతో పాటు, గ్రామాలలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న ప్రలోభలకు, దౌర్జన్యాలకు, బెదిరింపులకు, అడ్డు అదుపు లేకుండా పోయింది. శనివారం స్థానిక పత్తికొండ రోడ్డు పక్కన నివాసము ఉంటున్న మేడిపోయిన మారుతిని ప్రధాన కూడలిలోకి కొంతమంది వైసీపీ నాయకులు పిలిపించారు. ఓటుకు వెయ్యి రూపాయలు ఇస్తాం.. వైసీపీకి ఓటు వేయాలని కోరగా, తన ఓటు వైసీపీకి వెయ్యను, టీడీపీకి ఓటు వేస్తానని మారుతి సమాధానం ఇచ్చాడు. దీంతో వైసీపీ నాయకులు రెచ్చిపోయి దాడికి పాల్పడ్డారు. దాడికి గురైన మారుతిని స్థానికులు గమనించి వారి నుంచి రక్షించి తన నివాసం దగ్గరకు వదిలిపెట్టారు. ఓటర్లపై ఈ విధంగా దాడులకు పాల్పడే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు, ప్రజలు కోరారు.

ఆలూరును ఐక్యంగా అభివృద్ధి చేసుకుందాం





మరకట్టు గ్రామంలో అవ్వను ఓటు అడుగుతూ పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేస్తున్న వీరభద్రగౌడ్, హలేబీడులో మాట్లాడుతున్న దృశ్యం, తుంబళబీడులో వీరభద్రగౌడ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

- వేదవతి ప్రాజెక్టు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు పారిద్దాం
- గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- మేనిఫెస్టో మేరకు పథకాలు అందేలా చూస్తాం
- వలసల నివారణకు ప్రణాళికలు
- యువత ఉపాధి కోసం పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం
- ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్
- హలేబీడు, తుంబళబీడు, మరకట్టులో ప్రచారం

ఆలూరు, మే 11: ఆలూరు అభివృద్ధి కోసం అందరూ ఐక్యంగా కదిలి టీడీపీకి ఓటు వేసి వేయించి నియోజకవర్గ అభివృద్ధి కోసం బాటలు వేద్దామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారం ముగింపు కార్యక్రమంలో భాగంగా మండలంలోని హలేబీడు, తుంబళబీడు, మరకట్టు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు పారించుకుందామన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలికంగా గ్రామాల్లో వేధిస్తున్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకుందామని పేర్కొన్నారు. ఆలూరు ప్రాంతంలో ప్రజలు ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా ఎల్ఎల్సీ, హెచ్ఎల్సీ, ఆలూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. సోమవారం జరగనున్న ఎన్నికల్లో తనను, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి పంచలింగాల నాగరాజును ఆదరించి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచి ఎల్లప్ప, వెంకటేశ్వర్లు, ఉసేని, దేవేంద్రప్ప, మద్దిలేటి, కేశన్న, ఉపేంద్ర, బాలరాజు, రాజశేఖర్, డేగులపాడు సర్పంచి నీలకంఠ, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, దేవేంద్ర, బలరాం, నాగరాజు, మహీధర్ రెడ్డి, రామంజనేయులు, ఉచ్చవీరప్ప, మూసనపల్లె నారాయణ పాల్గొన్నారు.

వైకుంఠం జ్యోతి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న వైకుంఠం జ్యోతి

టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్‌ను, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి పంచలింగాల నాగరాజును గెలిపించాలని కోరుతూ టీడీపీ మహిళ నాయకురాలు వైకుంఠం జ్యోతి ఆలూరు పట్టణంలోని కోయనగర్‌లో ఇంటింటికీ తిరిగి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను వివరించారు.

మా భూముల్ని లాక్కుంటే ఊరుకోం

- *రాఘవేంద్రరెడ్డి, పరిశీలకులు దేవళ్ల మురళి*
- *512 జీవో ప్రతులను దగ్ధం చేసి నిరసన*
- *గంగులపాడు గ్రామ ముస్లింలు టీడీపీలో చేరిక*
- *తిమ్మాపురం, సాతనూరులో కొనసాగుతున్న చేరికలు*



జీవో ప్రతులను చూపుతున్న టీడీపీ శ్రేణులు, కాపీలను దగ్ధం చేసి నిరసన తెలుపుతున్న నాయకులు

మంత్రాలయం, మే 11: తాత, ముత్తాతలు, తండ్రులు సంపాదించిన భూములను 512 జీవో పేరుతో లాక్కుంటే చూస్తూ ఊరుకోమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు దేవళ్ల మురళి అన్నారు. శనివారం మంత్రాలయం మండలం మాధవరం టీడీపీ కార్యాలయంలో 512 జీవో ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఇప్పటికే సర్వనాశనం చేసిన జగన్ రెడ్డికి ఓటు వేస్తే భూములు కోల్పోతారని అన్నారు. ల్యాండ్, సాండ్, మైన్స్, వైన్, గంజాయి డ్రగ్స్, ఎర్రచందనం, రేషన్ బియ్యం కొల్లగొట్టి రూ.8 లక్షల కోట్లు జగన్ రెడ్డి స్వాహా చేశారని అన్నారు. ఈ పాపపు సొమ్ముతో ఎన్నికల్లో మరోసారి గెలవాలని చూస్తున్నారని, ప్రజలంతా అప్రమత్తమై జగన్ ఆగడాలను కట్టడి చేయాలని కోరారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చాకలి విరుపాక్షప్ప, రామక్రిష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాల చేరిక

పెద్దకడుబూరు: మండలంలోని గంగులపాడు గ్రామానికి చెందిన 50 వైసీపీ ముస్లిం కుటుంబాలు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి నివాసంలో వీరిని పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అలాగే మంత్రాలయం మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకట్రాముడు, తిమ్మప్ప, హనుమంతు పాల్గొన్నారు.



రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న వివిధ గ్రామాల నియోకవర్గ ప్రజలు

టీడీపీకే మా ఓటు..

కోసిగి : సాతనూరు గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు టీడీపీ మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. సాతనూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రాజు, జయరాజు, నాగరాజు, పెద్ద అంజినేయ, ఆనంద్, భీమయ్య, లక్ష్మయ్య, బొగ్గుల నాగరాజు, తిక్కయ్య, సామేల్‌తో పాటు మరి కొంత మంది వైసీపీని వీడి టీడీపీ కండువాలు వేసుకున్నారు. అనంతరం టీడీపీలో చేరిన సాతనూరు నాయకులు మాట్లాడుతూ 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా కొనసాగిన బాలనాగిరెడ్డి కనీసం మా గ్రామానికి తాగునీరు కూడా అందించలేదని, టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సాతనూరు నాయకులు రఘు, నాగేంద్ర, రాజు, విరుపాక్షి ముకుందప్ప, ఈరన్న, తదితరులు ఉన్నారు.

మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టా రంగయ్యపై కత్తితో దాడి

● కేసు నమోదు
● బుట్టా రేణుక సోదరుడు యుగంధర్‌పై చర్యలు తీసుకోవాలి



10 దాడికి గురైన బుట్టా రంగయ్య

ఎమ్మిగనూరు మే 11: ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టా రంగయ్యపై శుక్రవారం రాత్రి దాడి జరిగింది. శనివారం బాధితుడు తెలిపిన వివరాల మేరకు వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక సోదరుడు యుగంధర్ వేధింపులు, బెదిరింపులు తాళలేక రెండు రోజుల క్రితం వైసీపీ పార్టీకి రాజీనామా చేశా. దీన్ని జీర్ణించుకోలేని యుగంధర్ నాపై నా సమీప బంధువులను రెచ్చగొట్టి దాడికి ఉసిగొల్పాడు. నా భార్య సోదరుడు నాతో గొడవకు దిగి నన్ను తీవ్రంగా అవమానపరిచేలా మాట్లాడటమేకాక కత్తితో నాపై దాడికి దిగాడు. అతడి అతడి బారి నుంచి తప్పించుకునేందుకు చేతిని అడ్డుపెట్టా. రక్తగాయమైంది. దాడి నుంచి తప్పించుకుని పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశా" అని వివరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని గాయడిన తనను చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లారని తెలిపారు. నాపై దాడి చేయించిన యుగంధర్‌పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, తనకు రక్షణ కల్పించాలని కోరారు. వైసీపీకి రాజీనామా చేసిన రెండు రోజుల్లోనే మున్సిపాల్ మాజీ చైర్మన్ బుట్టా రంగయ్యపై దాడి జరగడంపై పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడుగడుగునా నీరాజనం..

● పత్తికొండ మండలంలో కేఈ విస్తృత పర్యటన
● హారతులతో స్వాగతం పలికిన మహిళలు
● పందికోనలో ఎన్నికల ప్రచారం ముగింపు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు, హాజరైన జనం, ఎం అగ్రహారంలో కేఈ రుద్రగౌడును సన్మానిస్తున్న గ్రామస్థులు, పెరవలిలో కేఈ హరిబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న యువత

పత్తికొండ, మే 7 : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు చివరి రోజు శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ప్రచారానికి వెళ్లిన ఆయనకు గ్రామగ్రామనా ప్రజలు నీరాజనం పలికారు. హారతులతో , గజమాలలతో స్వాగతం పలికారు మడలంలోని అటికెటగుండు, దేవనబండ, జూటూరు, నలకదొడ్డి, కొత్తపల్లి, పందికోన గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికలప్రచారం నిర్వహించారు. ఆయాగ్రామాల్లో కేఈ శ్యాంబాబు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ.. హంద్రీనీవా నీటి ద్వారా గ్రామగ్రామానికి సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకసాగుతామన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించడం ప్రతి ఓటరు బాధ్యతగాతీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామానాయుడు, హోటల్ శ్రీనివాసులు, జనసేన ఇన్‌చార్జి రాజశేఖర్, టీడీపీ నాయకులు బత్తినలోక్‌నాథ్, బత్తిన కుబేర్‌నాథ్, బత్తిన సురేంద్రనాథ్, దేవనబండ చంద్రశేఖర్‌రెడ్డి, గోవిందు, బోనాలకాశీ, జూటురు ఈశ్వరప్ప, కడవలసుధాకర్, చెన్నంనాయుడు, జరం గిరాజు, రాజశేఖర్ నాయుడు, బాలరాజుగౌడ్, అటికెలుగుండు రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డిలతోపాటు ఆయాగ్రామాల ప్రజలు, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

పత్తికొండలో టీడీపీ బారీర్యాలీ..

ఎన్నికలప్రచారంలో భాగంగా పత్తికొండలో శనివారం సాయంత్రం టీడీపీ ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, సురేష్‌కుమార్, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, చల్లారవి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహం నుంచి అంబెడ్కర్ కూడలి వరకు ర్యాలీసాగింది.

టీడీపీ గెలుపును ఆపలేరు..

తుగ్గలి : ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి అన్నారు. తుగ్గలి, చెన్నంపల్లి, ముక్కెళ్ల, తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించి ఇంటింటికి వెళ్లి టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కేఈ శ్యాంబాబు, బస్తిపాటి నాగరాజులకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

టీడీపీలోకి చేరిన కడమకుంట్ల వైసీపీ నాయకులు

వైసీపీ అరాచకాలు తట్టుకోలేక ఆ పార్టీని వీడి టీడీపీలో చేరామని కడమకుంట్ల వైసీపీ నాయకులు రమేష్ నాయక్, రంగస్వామి నాయక్, సురేష్ నాయక్, చంద్ర నాయక్ అన్నారు. కడమకుంట్లలో టీడీపీ నాయకులు ఫక్కీరప్ప, వెంకట్రాముడు, తులసి నాయక్ ఆధ్వర్యంలో ఎల్లమ్మగుట్ట తండా వాసులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయుడు నాయక్, రాజు నాయక్, గోవిందు నాయక్ ఉన్నారు.

టీడీపీ విజయాన్ని ఆపలేరు..

మద్దికెర: రాష్ట్రంలో టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ తనయుడు కేఈ రుద్రగౌడు అన్నారు. శనివారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు విజయం కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు రుద్రగౌడును సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్ చౌదరి, ఎర్రిస్వామి, హుశేన్‌పీరా, రమేష్, పెద్దన్న, ఇమామ్‌సాబ్ తదితరులు ఉన్నారు.

టీడీపీలో చేరిక

మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన 30 మంది యువకులు, వారి కుటుంబ సభ్యులు మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి కుమారుడు కేఈ హరిబాబు సమక్షంలో శనివారం టీడీపీలో చేరారు. రాజేశ్వర చౌదరి, పారా రవికుమార్, మెడికల్ స్టోర్ తిమ్మప్పచౌదరి ఆధ్వర్యంలో యువకులంతా టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహులుగౌడు, రంగస్వామి యాదవ్, రామాంజనేయులు, గడ్డం నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

బీవీ రోడ్‌షోకు భారీ స్పందన



పట్టణంలో బీవీ రోడ్‌షో కు తరలివచ్చిన జనం, ర్యాలీగా సాగుతున్న మహిళలు



రోడ్‌షోకు ముందు నృత్యాలు చేస్తున్న సీబీఎన్ టీం

ఎమ్మిగనూరు, మే 11: ఎన్నికల ప్రచారం చివరి రోజు శనివారం టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎమ్మిగనూరు పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోకు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. జనం భారీగా తరలివచ్చి నీరాజనం పలికారు. చివరిరోజు కావడంతో ఇరు పార్టీలు పట్టణ ప్రజలను ఆకర్షించేందుకు రోడ్‌షోలను నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి పట్టణంలోని 34వ వార్డుల్లో రోడ్‌షోను నిర్వహించారు. ఉదయాన్నే స్థానిక తేరుబజారులోని చాపలబండ నుంచి రోడ్‌షో ముగతిపేట, ఎన్టీఆర్ కాలనీ, శివన్ననగర్, అబ్బాస్‌థియేటర్, సోగనూరురోడ్డు, కలుగట్ల రోడ్డు, షరఫ్‌బజార్, గోనెగండ్ల సర్కిల్, గోనెగండ్ల రోడ్డు, ఆదోని బైపాసురోడ్డు, ఎస్ఎంటీ కాలనీ, అన్నమయ్య సర్కిల్, ఎంఎస్‌నగర్, యల్లంబీడు, కమిటీ రోడ్డు, శ్రీనివాససర్కిల్, వైఎస్సార్ సర్కిల్, సోమప్ప సర్కిల్, శివ సర్కిల్, లక్ష్మీపేట, సంజీవయ్య నగర్ ప్రాంతాల మీదుగా రోడ్‌షో నిర్వహించారు. ఆయా కూడళ్లలో బీవీని పూలమాలలు, దుశ్యాలువల తో సన్మానించి అభిమానాన్ని చాటుకున్నారు. మరికొంతమంది భారీ గజమాలలతో సన్మానించారు. మునుపెన్నడూ లేనివిధంగా ఎన్నికల చివరి రోజు బీవీ నిర్వహించిన రోడ్‌షోకు చేనేత వార్డుల్లోను, ముస్లిం మైనార్టీ వార్డుల్లోను, ఎస్సీ వార్డుల్లోను విశేష స్పందన లభించింది. ప్రజలు స్వచ్ఛందంగా రోడ్‌షోలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎన్నికల్లో మా మద్దతు బీవీకేనంటూ గంతాపదంగా చెప్పుకున్నారు. పట్టణంలో బీవీ నిర్వహించిన రోడ్‌షోకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.



ప్రజలకు అభివాదం చేస్తున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి

అరాచకపాలన అంతానికి ఒక్కరోజే గడువు : బీవీ

ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం సాగించిన అరాచకపాలనకు ఇక ఒక్కరోజే గడువు ఉందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. రోడ్‌షోలో పాల్గొన్న ఆయన పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనపై నిప్పులు చెరిగారు. ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రజలకు చేసిందేమిలేదన్నారు. అందరికి అమ్మఒడి ఇస్తానని ఒక్కరికి ఇచ్చాడని, సన్నబియ్యం అంటూ ఉన్న బియ్యాన్ని కూడా అమ్మేసుకున్నారని విమర్శించారు. సైకిల్‌కు ఓటు వేస్తే టీడీపీ సూపర్-6 పథకాలతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా బస్తిపాటి నాగరాజును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు కొండయ్యచౌదరి, రాందాసుగౌడు, దయాసాగర్, మహేంద్ర, సుందర్‌రాజు, అంబేద్కర్, ముల్లాఖలీముల్లా, కటారి రాజేంద్ర, నజీర్, దేవేంద్ర, మిన్నప్ప, కామార్తి మహేష్, రంగస్వామిగౌడు, రామకృష్ణ నాయుడు, షాలేమ్ పాల్గొన్నారు.